# "మా వి ద్వి షా వ హై"

●

పగలు....ఒంటిగంట—

వార్తలు మోసుకువచ్చే పొడుగాటి కాగితాలు....నురుగులు కక్కుకుంటూ పరుగెత్తుకువచ్చి....ఎదుట నించున్నాయి.

తేరిచూశాను. కళ్లు భగ్గుమన్నాయి.

అంతే........

అడ్డంగా....నిలువుగా-రెక్కలుతొడుక్కున్న క్రౌర్యంలా-బాకులు—ఎగురుతున్నాయి.

'ధన్....ధన్—ధనా' తుపాకులు పేలుతున్నాయి.

చుట్టూ తుపాకిమందు—క్రూరవాసన.

ఎగిరిన పాగాలు—ఇగిరిన గొంతుకలు—

చిదిగిన గడ్డాలు— విచ్చిన గుండెలు—

తిరిగే కన్నులు— ఒరిగే దేహాలు—

పాలరంగు పావలబుగ్గల్లో....

ఏనుగుదంతపువన్నె ఆడుపడుచు— వక్షంలో— బాకులు గుచ్చిన నెత్తురు—బుసబుసలు....

అన్నిటిలోంచీ ఒక్కటే రంగు—నెత్తురు—

దిక్కుమాలిన రక్తానికి—వర్ణభేదంలేదు గాబోలు!!

అరరే— చూశావా!

అన్ని కళేబరాల గాయాలూ....ఒకేఒక్క ఆఘాతమై—ఆతల్లి దేహవల్లినించి - ఎట్లా - రక్తపు చారికలుగా దిగజారుతున్నాయో—

అయ్యో —తలమీద బలమైన లాఠీ విరిగింది.
కళ్లల్లో చీకట్లు— అల్లా!
అల్లా చూడు!

*　　　*　　　*

మ్యూడువందలేళ్లు— వెనక్కి— ఒదిగిఒదిగి తప్పుకున్నాయి.

అద్భుతపరిమళాలు వెదజల్లే-అగరుపొగ—

పల్చని నల్లకలువరేకురంగు... సొగసుతీగలుగా సాగి-ధూమకరండకంనుంచి లేచి -ప్రాంతభూమినిమత్తులో ముంచుతూన్నది.

ఆ చంద్రశిలా మహారాజప్రాసాదంలోకి - నడువు - భయం లేదు.

భారతచక్రవర్తి మహేంద్రవైభవోపేతసభాభవనంలో - కాలుపెట్టు.

గోడలమీద శిల్పాల్లో నిలిచి- రంగురంగు ఈరెండలు కాసే పద్మరాగగోమేధికమాణిక్యాల వెలుగుకు కళ్లను సర్దుకుని - నెమ్మదిగా ముందుకు కదులు-

వజ్రాల అంచులతో, మరకతాల తరులతాది మధ్యచిత్రాలతో, ధగధగ మెరిసే- విశాల రత్నకంబళంమీద-

తెల్లపట్టు మస్‌నద్‌ను ఆనుకొని-శ్రీ షాజహాన్ చక్రవర్తి-

ప్రక్కగా - చక్రవర్తి ప్రియపుత్రుడు - దారాషుకో - కావ్యకళాప్రియుడు-

చక్రవర్తి— చిటికెనవేలి నీలపుటుంగరం .... చరాలున

మెరిసేలా.... సవిలాసంగా .... హుక్కా అందుకొని .... రెండు గుక్కలు పీల్చి.... సన్నజాజుల .... కటుగంధధూమలతలను నెమ్మదిగా ఊదుతున్నాడు—

మంత్రి సామంతాదుల.... శుష్కరాజనీతి.... ఎగయని శాంతసుభగవాతావరణం.

ఆ విశాలసభాభవనంలో.... మూడవ సభ్యుడు— ఒక మధురశ్రోత్రియమూర్తి—

మేలిమిబంగారపు తీగతో చుట్టిన....రుద్రాక్షతావళంలోని-వజ్రం... అతని మెడమీద....ధగధగ మెరుస్తున్నది.

చల్లని శ్రీరాగంతో.... మెల్లగా.... అందుకున్నాడు.-

తదవధి కుశలీ .... పురాణశాస్త్రస్మృతిశతవేదవిచారజో వివేకః,

యదవధి న పదం దధాతి చిత్తే హరిణకిశోర దృశో దృశో ర్విలాసః.

"అచ్ఛా ... బహుత్ అచ్ఛా" ఆ కవితామాధుర్యానికి ... కుడ్యరత్నచిత్రాలు ....కిలకిలమన్నాయి.

సౌధోపరిభాగంలోని .... గులాబీమేలిముసుగుల మృదు కంకణనిక్వాణం ముఖరితమైంది—

పాదుషా.... పెదవిపద్దకు తెచ్చిన హుక్కా....ఆపి....

మహాకవీ! జగన్నాథా! పండితరాజా!

మూగవోయిన ఈ రంగురాళ్లు కావు .... మా సభా భవనరత్నాలు- మీరూ మా సభామందిర-దివ్యరత్నం!

తన చేతులతో - మహాకవిచేతులను - అప్యాయంగా అందుకున్నాడు.

తళతళమనే రెండు ఆనందాశ్రువులు - మొగల్ సార్వభౌముని- కళ్ళల్లో- మెరిసి చెక్కిళ్ళమీదుగా జారాయి.

♦ ♦ ♦

"ప్రతీమన నను దయజూచెదవో ఇనవంశోత్తమ రామా! నా తరమా—" జైలుగోడలు జాలితో చెమర్చాయి.

అతని విశ్వాసానికి — జైలుతలుపు - ఉక్కుఖడ్డీలు నిశ్వసించాయి కాని-

ఆ డబ్బెవరిది? అధికారదుర్వినియోగం-

కాదులే. అంధవిశ్వాసం. -

తప్పు- ఆత్మత్యాగం

నవాబు ధనంతో - కాఫిర్ గుడిగోపురాలు- కదూ?

తహాస్సీల్‌దారుతల— ఎగిరిపోతుంది. పాపం—

"ఖోలో" "—దర్వాజ్ ఖోలో—"

కారాగారపు ఉక్కుతలుపులు—లోభిపిడికిలిలా-బద్ధకంగా తెరుచుకున్నాయి

"గోపన్నా—భాయీసాబ్!" "ప్రభూ, ప్రభూ, వచ్చావా?- రామా! నయనాభిరామా! పట్టాభిరామా! దయచేశావా?—ఇప్పటికి"

గాభరా వద్దు—భాయీ! నన్ను చూడండి- గోల్కొండ- మీమీద వాదులు విని—బందీలో వేశాం,"

"ప్రభువులు— తల తీయించండి. నా భద్రమూర్తిని— త్వరగా చేరుకుంటాను.

"తొందరవద్దు— తప్పులు చెయ్యడం ఎంత సహజమో, దిద్దుకోవడం అంత సులభం — ఆలుబిడ్డలకోసం — మీ భోగంకోసం—చెయ్యలేదు. నిజం, అల్లా ఆజ్ఞ— మీ చేతిమీదుగా ఖర్చుపడింది. ఫర్వాలేదు.

మీరు కట్టించిన గుడి అందం చూశాను. కాఫిర్ ద్వేషం లేదు. ఖుషీ కలిగింది ఇక మీకు స్వేచ్ఛ— మీ రాముడిలో అల్లాను—చూస్తాను."

బందిఖానా —హఠాత్తుగా—భద్రాచల రామాలయం.

శ్రీరామనవమి— గర్భాలయపు గంటలు—అమోఘంగా మోగుతున్నాయి

చిరునవ్వుతో—వింటూ ఎదుట—నిలిచిన— గోల్కొండనవాబు-తానీషా!

* * *

నిషాపూర్! అదిగో.... పారశీక సుందరసీమలు ....

ఆ ఉద్యానంలో.... విరియబూసిన.... కొమ్మలతో ఊగే గులాబిపొదలవద్ద.... ఎవరు వారు?

తెల్లని అంగరఖాలో .... మెరిసే ... పండుతమలపాకు రంగు.... పచ్చని....శరీరం. పండిన గెడ్డం.

విజ్ఞాన సీమల్లా - విస్తరించిన రెండునేత్రాలు, లోకాతీత సుందరానుభూతులు - చూపించే రెండుదీపాలు. .

ఒకపద్యాల పుస్తకం - ద్రాక్షారసంతో - నింపిన - రెండుకూజాలు, ఒక సరకం - ఎదుట -

"అచ్ఛా - స్వేచ్ఛాజీవీ!" - ప్రక్క కూజా సవరించి-అమృతం వడ్డించే పారశీక మోహిని -

ఆమె చక్కని నేత్రాల నీడలతో ఆ మధువు మరీమత్తుగా తియ్యగా ఉందా?

సాఖీ!

ఆ మోహిని -

కోటి మొగలిపూల నునుపుతో మెరసే వక్షం అతని మీదకు వంచి - ఇంకొక చషకం మధువునింపి - అమరమాధురులు ఒలికించే అతని పెదవులకు అందించి -

నవ్వింది.

అతడు - తెల్లని ఆమెనవ్వును -

ఎర్రని మధువును. త్రాగి మైకంతో కన్నులు అరమోడ్చి ...

"అచ్చరవంటి నెచ్చెలి.... రసాంచిత కావ్యము, కెంపు పానకంబు ...

ఇచ్చగ అమనిం దొరికెనేని–మసీదుల గుళ్లదాస్యమున్–మెచ్చక–ముక్తులై –సుఖముమీర చరింతురు... జాగరూకులై ...."

. . . . . . . .

"భేష్.... భేషక్"

. . . . . . . .

ఎవరు వారు?

పూర్వం....

నిషాపూరు ఉండి చెరిగిపోయిన చోటు ..

ఒక విశాలజీర్ణోద్యానం....

ఏవేవో పర్షియామునలిచెట్లు—ఎత్తుగా పెరిగి మురుసుకొనే జ్ఞాపకాల బరువుతో....నెమ్మదిగా....తలలు కదుపుకున్నాయి.

చల్లని చెట్లనీడల్లో .... బతికినవాడు భరించలేని నిశ్శబ్దమృత్యుశ్శైతల్యం—

ఎదుటిగోడను ఆనుకొని....ఒక జీర్ణమైనసమాధి—

గాలికికదలే ఉన్నతవృక్షాగ్రాలనుంచి-చెట్లను పెనవైచుకున్న తీగలకొనలనుంచి .... ఉండిఉండి ఆకులూ .... పూలూ .... ఆ సమాధిమీద రాలుతున్నాయి.

నలుగురు—ఆధునికభారతీయకవులు-స్విన్న వదనాలతో-ఆర్ద్రనయనాలతో ఆ సమాధిముందు .... చేతులుమోడ్చి .... నిలుచున్నారు.

ఒకగొంతు....ఆ మృతనీరవప్రకృతికి.... ఊపిరికల్పిస్తూ, పలికింది—

.... .... .... ....

"ఓయీ ఉమ్రఖయామ! నీవుచని ఎన్నోఏండ్లుపూండ్లాయె;

లేఁబ్రాయంపుం జెలి సాఖియున్— ధరణి గర్భంబందు నిద్రించె;

గుర్తే యౌపట్టక నీ నిషాపురము....జీర్ణించెం గదా!
నీదు గోరీయైనన్ సడలున్,
రుబాయి తొకటే....స్మృత్యంకమై నిల్చెడున్."

♦ ♦ ♦

ఎక్కడి పారశీకదేశం?
ఎక్కడి భారతీయ సీమలు?
ఏ హృదయామరాగబంధం—
ఇద్దరినీ....కలిపిందో—

* * *

గ్రామంలో రంజాన్ పండుగ—బ్రహ్మాండంగా జరుగుతున్నది

వాడవాడలా . . హిందూ పులులు .... ముసల్మానుల్లో.... ములిగి చెలగి ఆడుతున్నాయి

పీర్లకు దండంపెట్టుకున్న అమాయకపు పేరంటాళ్లు .... పసుపుకుంకాలు, పళ్లు . మొక్కుబడి చెల్లించి మరలుతున్నారు.

విద్యాలయానికి వెడుతూ . మసీదుదగ్గరికి వచ్చాను.

రంగుచెమ్కీలు ... ఫెజ్ టోపీలు—

అంగరఖాలు— ముస్లిం యువకులు .... ఉత్సవంగా ... ఉత్సాహంగా ...ఎదురువస్తున్నారు.

మసీదులోంచి— మంచిరకం అగరొత్తుల.... వాసన.... గాల్లో కలిసి సుఖంగా ఒస్తోంది

హఠాత్తుగా—కల్లోలం—

చిటికెలో పెద్దదూళి—ధూళిని మించిన కేకలు-అలజడి-అల్లరి. కారణం తెలియదు.

పదులు — వందలు — దిక్కు తెలియని ధూళిలో పరుగెత్తుతున్నారు.

లాఠీల టకటకలతో—చెవులు చిల్లులు పడుతున్నాయి.

ఆక్రోశాలు—హాహాకారాలు— కోపాలు—శాపాలు—పాగాలు—ఎగిరాయి. టోపీలు....చిదిగాయి.

ధూళితెర....భయంకర జాతిద్వేషంలా ఆకాశానికి లేచింది

తలవనితలంపుగా— కల్లోలంమధ్య—నేను.

తెర కవతలనుంచి ఒక జనప్రవాహం — ముందుకు దూకుతున్నది.

మసకలో- దృశ్యాదృశ్య- పరిచిత- ముస్లిం యువకులు- ముగ్గురు.

మస్తాన్—

మహబూబ్—

రహిమాన్—

. . . . . . . . . . . . .

పరాలున-ఒక బాకుచేయి—ధూళిని చీల్చుకొని-నాగుండెకు సూటిగా - వచ్చింది

బాకు పిడికిలివెనక- పచ్చని షెర్వాణీతో దూసుకువచ్చే శరీరం- దగ్గరకు వచ్చింది-

"మస్తాన్!" కెవ్వున అరిచాను.

ఎదుటికళ్లలోని ఎరుపు తెల్లబోయింది. గొంతు ఒణికింది.

"మాస్టరు సాబ్!!"

"ఇదిగో— గుండె- ఆలోచించకు. నీ చెయ్యి మంచిది."

ఎదిరిని దహించే చిరునవ్వు- "మీరా?" పాపం. తడికళ్ల తుడుచుకుంటున్నాడు.

రెండు లాఠీలు- తలదాకా- వెళ్ళి- హఠాత్తుగా- ఆగాయి.

గట్టిగా నవ్వాను.

"కాపీండి"

"నమస్కారం, నమస్కారం.
"పిచ్చివాళ్ల...."
గట్టిగా కౌగలించుకున్నాను
"సహనా వవతు....
మా విద్విషావహై"
కిలకిల నవ్వారు.

*

కళ్లు విప్పాను.
భారతపటం నుదుటిమీద....
గాడినగాయాల్లోంచి....
వేడివేడి నెత్తురు చుక్కలు....